
# సుబ్బారావు నవ్వేడు

అలపర్తి రామకృష్ణ



సుబ్బారావు కెమెరా కొనాలనుకున్నాడు.

కొనేసేడు.

అనుకున్నవి సమకూర్చుకోడానికి అతనేం లక్షాధికారి కాదు. కనీసం స్టేట్ మంత్రి కాదు. పోలీసు ఆఫీసర్ అంతకంటే కాదు.

సుబ్బారావు యల్. డి. సి సుబ్బారావే! (నాన్ గెజిటెడ్) బ్రాకెట్‌లో పెట్టుకుంటే ఆఫీసరే!

నాల్గువేలిచ్చి నాల్గేళ్ల క్రితం కొనుక్కున్న ఉద్యోగమది.

సుబ్బారావు ఎవరు ?

...వాళ్ల అమ్మమ్మ మనవడు. ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు. చామన ఛాయ. ఎడమకన్ను మెల్ల. 'అదృష్టం' అంటుంది వాళ్లమ్మమ్మ. జుత్తు మొహంమీద పడుతూ ఉంటుంది. తెలుగు ఇంగ్లీషులా మాట్లాడేస్తుంటాడు.

రాజేష్ ఖన్నా వేసుకునే 'ఫేమస్ కుర్తా' వేసుకోవాలనో, బెల్ బాటమ్ పాంట్స్ వేసుకోవాలనో, పెద్దఅద్దాల కూలింగ్ గాగుల్స్ కొనుక్కోవాలనో, రాకెల్ వేల్ష్ నటించిన సినిమాలు చూడాలనే కోరికలు అతనిలో మచ్చుకైనా లేవు. 'హిమబిందును' పెళ్లి చేసుకోవాలనే పెద్దకోరిక తప్పితే సుబ్బారావు పెద్దగా కోరికలు లేని మానవుడనే చెప్పవచ్చు.

సుబ్బారావుకు రచయితల మీద బోలెడు కోపం. ఒక అసమర్థపు పాత్రను సృష్టించి తనపేరు పెట్టేస్తుంటారని అతని వాదం.

కెమెరా కొన్నాడు.

హిమబిందు ఫోటో తియ్యాలని అతని కోరిక.

ఆరోజు సుబ్బారావు 'చుక్కల్లో చంద్రుడి'లా వెలిగిపోతున్నాడు. కొత్తగా మార్కెట్టులోకి వచ్చిన 'సబ్బు'లా వున్నాడు. నిజంగా సబ్బులా కాదుగాని సబ్బుపై కాగితంలో వున్న అందమైన అబ్బాయిలా వున్నాడు. కూనిరాగం తీస్తూ ఇంట్లోకి అడుగు పెట్టబోయేదు సుబ్బారావు పక్కింటి గుమ్మంవైపుచూడటం మానలేదు... హిమబిందు గుమ్మం దగ్గర లేదు ...

'హిమ బిందు కనుబడుటలేదు' — పేపర్ ఎడ్వర్టైజ్‌మెంటు గుర్తుకు వచ్చి నవ్వుకున్నాడు. చంద్రుడి మీది రాతిముక్కను భద్రంగా పట్టుకున్న చంద్రగోళ యాత్రికుడిలా, కెమెరాను గుండెల కదుముకున్నాడు.

సుబ్బారావు హాల్లో అడుగుపెట్టగానే, బెల్లం చుట్టూ చీమల్లా పిల్లలంతా అతన్ని చుట్టుముట్టారు. ఆ గుంపులో సుబ్బారావు పెద్దన్నయ్య కొడుకులు, పురిటికి వచ్చిన పెద్దక్కయ్య కూతురు, కట్నం సరిగ్గా ముట్టజెప్పలేదని పుట్టింటికి తరిమివేయబడ్డ రెండో అక్కయ్య కొడుకు, తమ్ముళ్లు వున్నారు.

సుబ్బారావు 'మనస్సు' తప్పితే ఆ యింట్లో అతని మాట యెవ్వరూ వినరు. తన మాట విననందుకు అతను బాధపడడు — కోప్పడడు.

'నిక్సన్' మాటవినే 'థియూ' లాంటి వాడెవడూ ఆ గుంపులో లేడు. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా వాళ్ళమధ్య చిక్కుకుపోయేడు. అతని చేతిలోని కెమెరాను బలవంతంగా లాక్కోసాగేరు పిల్లలు. అది పప్పు పప్పు అయ్యేటట్లుగా వుంది. లాభం లేదనుకుని వాళ్ళకిచ్చేశాడు. ఆ పిల్లలందరికి పెద్దన్నయ్య కొడుకు రమణగాడు లీడరు ... వాడిని బ్రతిమాలుకోక తప్పదు.

"ఒరేయ్! రమణా! అది పాడయి పోతుందమ్మా!"

వాడి చొక్కాగుండీ సరిజేశాడు. తల నిమిరాడు. పావలా బిళ్ల చూపించాడు. పావలా బిళ్ల జేబులో వేసుకున్నాడే గాని, కెమెరా సుబ్బారావు కివ్వలేదు.

"రమణా ... నువ్వు అచ్చు 'బాలరాజు' సిన్మాలో మాస్టర్ ప్రభాకర్‌లా వుంటావురా! ఫొటోలో యింకా అందంగా వుంటావు!"

వాడు నోరు తెరిచి ముయ్యటం మర్చిపోయేడు.

రమణ కళ్లు మెరిశాయి.

"బాబాయ్ ... నాఫోటో తీశావంటే నీ కెమెరా మళ్లీ అంటుకోను"— అన్నాడు మర్యాదగా.

ఫోటో తియ్యమని అందరూ గొడవ చెయ్యటం ప్రారంభించారు. హిమబిందు లాంటి అందమైన అమ్మాయి ఫోటో తీసి కెమెరా ప్రారంభోత్సవం చెయ్యాలనుకున్నాడు. అతనికాఅదృష్టం లేదు!

వాళ్ళందరినీ పెరట్లోకి లాక్కుపోయేడు. కొంతమందిని నిలబెట్టి మరికొంత మందిని కూర్చోబెట్టాడు. ఆ పిల్లల్లో యెవడికో సబ్బుతో మొహం కడుక్కోవాలనే ఐడియా వచ్చింది. సుబ్బారావును వొదిలిపెట్టి పంపు దగ్గరికి పరుగెత్తారు.

సుబ్బారావు సగం పడిపోయిన గోడవైపు చూశాడు.

హిమబిందు కన్పించలేదు.

పెరట్లో తనున్న సంగతి తెలియజేయటానికి పిల్లలను రమ్మంటూ పెద్దగా కేకేశాడు.

మళ్ళీ చూశాడు... ఆమె కన్పించలేదు.

బిలబిలమని పిల్లలందరూ వచ్చేశారు. కెమెరా కంటిదగ్గఱ పెట్టుకుని 'వెటరన్ ఫొటోగ్రాఫర్'లా చూస్తున్న సుబ్బారావుకు 'రమణ' శాల్తీ కనబడలేదు. కెమేరాను అటు, ఇటూ త్రిప్పి చూశాడు. అయినా ఆ శాల్తీ కన్పించలేదు.

కొన్ని క్షణాల్లో సుబ్బారావు పెట్టెలో దాచుకున్న కొత్త 'టై'ను మెడకు చుట్టుకొని పళ్ళికిలిస్తూ రమణ ప్రత్యక్షమయ్యాడు. సుబ్బారావుకు వొళ్ళు మండుకొచ్చింది. 'ఇజ్రాయేల్' చిన్న దేశమయినా, దాన్ని యేమీ చెయ్యలేని 'ఈజిప్టు'లా మనస్సులోనే తిట్టుకున్నాడు. 'ఇజ్రాయేలు'కు 'అమెరికా' సపోర్టు వున్నట్లు, రమణకు వాడి తాతయ్య అండ వుంది.

సగం పడిపోయిన గోడప్రక్క, బాదం చెట్టు నీడలో హిమబిందు తళుక్కున మెరిసింది.

సుబ్బారావు మొహం ఫ్లాషు లైటులా వెలిగింది. యమ అర్జంటుగా జేబులో నుంచి హాండ్‌కర్చీఫ్ తీసి మొహం మూడుసార్లు తుడుచుకున్నాడు.

అతను నవ్వాడు.

ఆమె నవ్వలేదు. ఆమెకు నవ్వు రావటం లేదు.

సుబ్బారావు వైపు దీనంగా చూసింది.

ఓపిగ్గా కూర్చున్న పిల్లలు ప్రతిపక్ష సభ్యుల్లా పెద్దగా కేకలు వెయ్యటం మొదలు పెట్టారు.

ఫోటో తీసి పిల్లలపీడ వదిలించుకోవాలనుకున్నాడు. సుబ్బారావు ప్రేమ చూపులు మానేసి, సరైన పొజిషన్‌లోకి వచ్చేసరికి— పిల్లలంతా రాతిబొమ్మలై పోయేరు.

"స్మైల్ ప్లీజ్!" —అన్నాడు పెద్దగా.

రమణగాడు దుర్యోధనుడి నవ్వు నవ్వేశాడు.

సీరియస్‌గా వాళ్ల దగ్గరకెళ్లి నిలబడ్డ వాళ్లని కూర్చోబెట్టి, కూర్చున్న వాళ్లని నిలబెట్టి — వాళ్లమీద కొన్ని క్షణాలు అధికారం చలాయించాడు. ఫోటో తీస్తున్నాడనే గౌరవం కొద్దీ అతను యేం చేసినా కొన్ని క్షణాలు మౌనం వహించారు.

"రెడీ!"

"... ... ..."

"క్లిక్"

ఫోటో తీసేసి వాళ్లని అక్కడనుండి తరిమేశాడు. యెక్కువసేపు అక్కడ నిలబడితే ఫోటో చెడిపోతుందని కొందరిని బెదిరించాడు కూడా.

హిమబిందు ముభావంగా చూస్తూనే వుంది.

ఆమెను పెళ్లి చేసుకోవాలని సుబ్బారావుకు ఐదేళ్లనుంచీ ఐడియా వుంది. ఆమె తండ్రి గుమాస్తా కాకుండా గెజిటెడ్ ఆఫీసరైతే, ఆమె చేతులకు మట్టిగాజులు కాకుండా బంగారపు గాజులు వున్నట్లయితే, అప్పు లేకుండా కట్నం యివ్వగల స్థితిలో వుంటే, ఆ అపరంజి బొమ్మ సుబ్బారావు పెళ్లామై వుండేది. పిల్లలతల్లికూడా అయ్యేదేమో!

హిమబిందుతో రెండు మాటలు మాట్లాడడానికి అవకాశం చిక్కింది.

పెరట్లో ... ...

బాదంచెట్టు నీడలో ...

సగం పడిపోయిన గోడ కిరుప్రక్కలా —

వాళ్లిద్దరూ —

"బిందూ!"

---

### జీవితం

— సుధామ

కమ్మని కలలదిండు కాదు జీవితం
కంటకాలతో కూడిన కాలిబాట జీవితం
జీవితం పడకకాదు—జీవితం నడక
చైతన్యపు చెంగలింపు కాదు జీవితం
తరుగులేని తమోనభం జీవితం
పడకపై దిండును కరచుకుని
నరాలచైతన్యపుచెంగలింపుక్రీడేజీవితమన్నట్లు
ఏమిటీ మత్తుమందు సుఖడోల ?

తమస్సే కంటకాలుగా విచ్చుకుని
ఎదపొరల్లో గుచ్చుకుని
నిరాశకు పీఠం వడుతుంది,

ఈ సుఖడోల తెగిపోయిన రోజు.
ద్వివిధా ప్రవృత్తమైన జీవితాన్ని
ఒకకోణం నుంచే చూడకు మరి
నిమ్నోన్నతాలను రెండింటినీ
ఆలోచనల గ్రాఫ్ కాగితంలో గుర్తుపెట్టుకుని
ప్రగతి నిర్దేశకత్వం చూడు
పడుక్కుని నడవకు
నడిచి నడిచి గమ్యంకొసనే పడుకో
కుందేలువు కాకు తాబేలువైనా ఫరవాలేదు
మూపున పగలని ఆశయాన్ని రక్షణగాఅమర్చుకో
పరుగు పందెంలో ఏకాగ్రతలో
హారంవేసిన కమరం లా బతుకు
మధ్యే మార్గంలో మభ్యపెట్టే పూలపొదల్లో
దాగకు
ముళ్లల్లో నడిచి పళ్లల్లో తేలు
నటిస్తే బాధితం—నడిస్తే జీవితం

# సుబ్బారావు నవ్వేడు

"... ... ..."

"మాట్లాడవేం ?"

"యేం మాట్లాడాలి ? మనస్సంతా మీరే అయినప్పుడు" —

మామూలుగా వున్నట్లయితే బిందు నోటి వెంట ఆ వాక్యం దొర్లేది.

బిందు మామూలుగా లేదు అంటే జ్వరం తగిలిందని కాదు. దెబ్బతిన్న పక్షిలా వుంది.

"యేమిటలా వున్నావు ? నీ ఫోటో తియ్యాలని నేను యెంతో హుషారుగా వస్తే !... బిందూ ! ప్లీజ్... నీ మనస్సులో బాధేమిటో నాకు చెప్ప గూడదా ?"

"నన్ను చూడటానికి మళ్లీ యెవరో వస్తున్నారట... ఈ సంబంధం ఖాయమయ్యేటట్టుగా వుంది. యాభయ్యేళ్ల పెళ్లికొడుక్కి పైసా కట్నం అక్కర్లేదట. మావాళ్లు నాకు పెళ్లయినట్లే సంబరపడుతున్నారు."

ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

అతని గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

అతను మాట్లాడాలనుకుంటున్నాడు. మాట్లాడలేక పోతున్నాడు.

ఆమె దిగులుగా చూస్తుంది.

'రాజధాని ఎక్స్‌ప్రెస్' రాజధానిని వదిలి పెట్టి తన గుండెల్లో పోతున్నట్టుగా ఫీలయ్యాడతను.

పానకంలో పుడకలా... కన్నీళ్లల్లో బొగ్గు నలుసులా—సెన్సారు బోర్డు మెంబరులా—యెవ్వరో పెరట్లోకి రావటంతో ఆమె యింట్లోకి వెళ్లిపోయింది.

నీరసంగా హాల్లోకి వచ్చేసేడు.

పిల్లలు పేకాట ఆడుతున్నారు. ఆట చేతగానివాళ్లు చుట్టూ చేరి గొడవ చేస్తున్నారు. చాపలమీద పడుకుని నిద్రరాక అటు, ఇటు దొర్లుతున్న ఆడవాళ్లు గోలచేస్తున్న పిల్లలను విసుక్కుంటున్నారు.

సుబ్బారావుకు కోపం వచ్చేసింది.

తనబాధని, కసిని, కోపాన్ని యెవ్వరూ గమనించక పొయ్యేసరికి ఆ కోపం—ధరల్లా పెరిగిపోయింది.

మంచినీళ్లు త్రాగుతుంటే చేతిలో గ్లాసు జారిపోయింది.

రేడియో సౌండ్ పెంచేసేడు

మట్టితిన్న పింజేరులా వుండే చిన్న తమ్ముడిని అనవసరంగా నాలుగుబాదేడు.


చొక్కా గుండీలు తెంపుకున్నాడు.

"అసమర్థుడిని"—మొదటిసారి తనలో తాను గొణుక్కున్నాడు...తండ్రితోమాట్లాడి అయిసా—పైసా తేల్చుకోవాలనుకున్నాడు... విసవిసానడుస్తూ వరండాలోకి వచ్చేడు.

తండ్రిని చూడగానే 'ఉగాండా సైన్యాధ్యక్షుడు'గుర్తుకు వచ్చేడు.

కొడుకు వైపు చూశాడు తండ్రి.

తండ్రి వైపు సూటిగా చూళ్లేక పోయేడు కొడుకు.




చుట్ట పొగ గుప్పున వదిలేడు ఆయన.

గట్టిగా నిట్టూర్పు విడిచాడు కొడుకు.

...చేతగాని వెధవను ... తండ్రిని అడిగే ధైర్యంలేదు...అసమర్థుడిని ... దద్దమ్మలా, అక్కుపక్షిలా, మూగ వెధవలా పెంచినందుకు వీళ్లనేం చెయ్యాలి ? ... యేమి చెయ్యలేడు తను...చెయ్యకూడదు కూడ ...

సుబ్బారావు మనస్సుకు పక్షవాతం వచ్చినట్లయింది.

చెమర్చిన కళ్లను తుడుచుకుని రోడ్డు మీదకు వచ్చేసేడు. రెండు రిక్షాలు హిమబిందు యింటిముందు ఆగివున్నాయి.

హిమబిందు యేడుస్తూ వుండి వుంటుంది ... ఫోటో తియ్యటానికే సైతం లేదు...వీలుపడలేదు.

ఆ అమ్మాయికేం లోపం ? హిమబిందు నాన్నవచ్చి అడిగితే తన తండ్రెందుకో కసురుకున్నాడు. నాన్న వొప్పుకున్నట్లయితే యెంత బాగుండేది ! నాన్నకు డబ్బు కావాలి ! వున్నవాడికి డబ్బు కావాలి ! లేనివాడికి కావాలి !... డబ్బు...పిచ్చి డబ్బు...

పార్కులో, బజార్లో, దుమ్ములో — దూళిలో తిరిగి—తిరిగి యింటికి చేరుకున్నాడు సుబ్బారావు.

హిమబిందు యింటి ముందు రిక్షాలు లేవు.

పెళ్లి కుదిరుండదు ... హాయిగా మళ్లీ కొన్నాళ్లు హిమబిందుతో మాట్లాడవచ్చు... నాన్నతో పోట్లాడాలి ! బిందును పెళ్లి చేసుకోవాలి.

'బవేరియా' ను ఆక్రమించుకోటానికి ముందుకు చొచ్చుకు వెళ్తున్న 'నెపోలియన్'లా యింట్లోకి అడుగు పెట్టాడు.

తండ్రి మాటలు సుబ్బారావు చెవుల్లోకి దూసుకుపోతున్నాయి.

బీరువాపై అరలో పెట్టిన కెమెరాను అందుకోవాలని రమణ తాపత్రయ పడుతున్నాడు.

హిమబిందు పెళ్లి నిశ్చయమైందట.

"అబద్ధం ... అంతా వొట్టిదే ... హిమబిందు నా పెళ్లాం" ...— గట్టిగా అరవాలనుకున్నాడు సుబ్బారావు. మెదడులో యేదో నరం "క్లిక్" మని శబ్దం చేస్తూ తెగిపోయింది.

సుబ్బారావు పెద్దగా నవ్వేసేడు.

'రమణ' చేతుల్లోనుంచి తప్పించుకుని క్రిందపడి పగిలిపోయింది 'కెమెరా'.